7

సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



నగరంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. రహదారులపై భారీగా వర్షం నీరు చేరింది. -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ







విద్యాలక్ష్మి అలంకరణలో...

శరన్నవరాత్రుల సందర్భంగా నగరంలోని కనకమహాలక్ష్మి, కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు విద్యాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరి ఆలయంలో విద్యార్థులు ప్రత్యేకంగా సరస్వతీ పూజలు నిర్వహించారు.

-డాబాగార్డెన్స్/ ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పీలా...ఢీలా

'స్థాయీ సంఘం'లో రచ్చ రచ్చ

- మేయర్‌పై గుర్రుమన్న కూటమి భాగస్వామి బీజేపీ కార్పొరేటర్
- పర్సనల్‌గా మాట్లాడుకుందామన్న మేయర్ శ్రీనివాసరావు
- మీతో మాకు పర్సనల్ ఏంటి? అని నిలదీసిన వైనం
- సొంత సభ్యులనుంచే మేయర్‌కు చుక్కెదురు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, స్థాయీ సంఘం చైర్మన్ పీలా శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశం.. మేయర్, స్థాయీ సంఘం చైర్మన్ పీలా శ్రీనివాసరావు, బీజేపీ కార్పొరేటర్ గంకల కవిత మధ్య తీవ్ర వాగ్వాదానికి వేదికైంది. సమావేశానికి కమిషనర్ వస్తారని మేయర్ చెప్పగా, 'కమిషనర్ ఊర్లో లేరని మీకు తెలియదా? లేక తెలిసీ అడుగుతున్నారా?' అంటూ కవిత నిలదీశారు. దీనికి మేయర్ స్పందిస్తూ మీరు కూర్చోండి. ఏమైనా ఉంటే వ్యక్తిగతంగా మాట్లాడుకుందాం అనడంతో వివాదం మరింత రాజుకుంది. మీతో మాకు పర్సనల్ ఏముంటాయని ప్రశ్నించారు. మీరు మేయర్‌గా కాకుండా కేవలం చైర్మన్‌గా మాత్రమే వచ్చారు. మేము కూడా ప్రజలతో ఎన్నికయ్యాం. సమావేశం సోమవారం అయితే మాకు ఆదివారం చెబుతారా? మీరు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. దీనికి పీలా శ్రీనివాసరావు ఇది అత్యవసర సమావేశం. ఇష్టం లేని వారు వెళ్లిపోవచ్చు అని బదులిచ్చారు. అంతేకాకుండా, స్థాయీ సంఘంలో మీకు స్థానం కల్పించింది నేను, నా పార్టీ నుంచి మీకు అవకాశం ఇచ్చాను అని మేయర్ తీవ్రంగా మండిపడ్డారు. మీరు మాకు క్లాసులు చెబుతారా? మీ వ్యవహార శైలి బాగాలేదు అంటూ కవిత..మేయర్‌పై విరుచుకుపడ్డారు.

జిరాయితీ భూమికి ప్లానింగ్ ఎలా?

శానాపతి వసంత మాట్లాడుతూ జిరాయితీ భూమికి అధికారులు ప్లానింగ్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దానికి చైర్మన్ స్పందిస్తూ, సంబంధిత అధికారులు లేరు, ఆ విషయం వదిలేయండి.. అని చెప్పగా, సభ్యురాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో కూడా నేను స్థాయీ సంఘంలో ఉన్నాను, అప్పుడు అధికారులంతా అందుబాటులో ఉండేవారు. ఇప్పుడు అధికారులు లేకపోతే ఎలా? అని మేయర్‌ను ప్రశ్నించారు. బంజరు భూమిలో రోడ్డు వేయగలమా అని ప్రశ్నిస్తూ, దీనిపై విచారణ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులు ఎక్కడ?

అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా, వార్డుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్ లేదని అధికారులు చెబుతున్నారని పలువురు సభ్యులు మండిపడ్డారు. నవంబర్‌లో జరిగే సదస్సుకు రూ. 40 కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. 'నగరాభివృద్ధి, సుందరీకరణకు మేము వ్యతిరేకం కాదు. కానీ మా వార్డుల పరిస్థితి ఏమిటి? మరో నాలుగైదు నెలల్లో పదవీకాలం ముగుస్తుంది, తిరిగి ఎన్నికలకు వెళ్లాలంటే మేము చేసిన అభివృద్ధి చూపించాలా వద్దా?' అని ప్రశ్నించారు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా తాము విఫలమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్ని అంశాలకు సభ్యుల ఆమోదం

ఈ తీవ్ర చర్చలు, నిరసనల అనంతరం, సమావేశంలో చర్చకు వచ్చిన 91 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. వీటిలో ముఖ్యంగా సీఐఐ భాగస్వామ్య సదస్సు-2025కు సంబంధించిన అంశాలున్నాయి. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ. 27.60 కోట్ల అంచనా వ్యయంతో నగర సుందరీకరణ, అభివృద్ధి పనులు, రూ. 5.3 కోట్ల అంచనా వ్యయంతో ఇతర ఇంజినీరింగ్ పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పారిశుధ్య కార్మికుల జీతాలకు కూడా ఆమోదం లభించిందని తెలిపారు. సమావేశంలో ప్రధాన ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోన్-1 జోనల్ కమిషనర్ ఇప్పి నాయుడు, 6వ జోన్ జోనల్ కమిషనర్ విజయ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్లు సంపత్‌కుమార్, రాయల్‌బాబు, గోవిందరావు, కె.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఏఎంవోహెచ్‌లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలకు అన్యాయం?

మరో సభ్యుడు మొల్లి ముత్యాలు జీవీఎంసీ పరిధిలోని విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తారు. 'జీవీఎంసీ అంటే కేవలం నగరం మాత్రమే కాదు, విలీన గ్రామాలూ ఉన్నాయి. కేవలం నగరంలోనే సుందరీకరణ, అభివృద్ధి పనులు చేపడితే విలీన గ్రామాలను ఎందుకు కలుపుకున్నట్లు? అని ఆయన ప్రశ్నించారు. శ్మశాన వాటికలకు కూడా రక్షణ లేకుండా పోయిందని, అభివృద్ధి పనులు అడిగితే బడ్జెట్ లేదని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్‌లో జరిగే సదస్సుకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడానికి మాత్రం బడ్జెట్ ఉంటుందా అని ఆయన దుయ్యబట్టారు.

వైఎస్సార్‌సీపీ సభ్యురాలి ఆగ్రహం

సమావేశం ప్రారంభానికి ముందు వైఎస్సార్ సీపీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ముఖ్యంగా సెక్రటరీ మేయర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని, స్థాయీ సంఘం సమావేశాల విధివిధానాలు ఏమిటో తెలియజేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశం ఉందని సోమవారం ఉదయం తనకు ఫోన్ చేసి చెప్పారని, అజెండా అంశాలు చదవడానికి కూడా సమయం ఇవ్వలేదని ఆమె అన్నారు. గత సమావేశంలో అడిగినా ఇప్పటివరకు విధివిధానాలు తనకు ఇవ్వలేదని ఆరోపించారు. తమ వార్డులు, జోన్లలో చేపట్టే ఏ కార్యక్రమమైనా తన దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు.

కూటమి దసరా దందా

- వివిధ విభాగాల సిబ్బందితో కలిసి పండగ మామూళ్ల వసూళ్లు
- కూటమి చోటా నేతల దిగజారుడు వైఖరి
- ఈపీడీసీఎల్, కమర్షియల్ ట్యాక్స్, జీవీఎంసీ సిబ్బందితో కలిసి వసూళ్లకు తెర
- పెద్ద దుకాణాలు, షాపింగ్ మాల్స్ టార్గెట్
- ఇవ్వకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు
- పశ్చిమ, దక్షిణ, పెందుర్తి నియోజకవర్గాల్లో వసూళ్ల పర్వం

సాక్షి, విశాఖపట్నం:

'ఏదయా మీదయా.. మా మీద లేదు... ఇంత సేపుంచుట ఇది మీకు తగునా.. దసరాకి వస్తిమని విన వినలు పడక...' అంటూ గురువులు, పిల్లలు గతంలో వీధుల్లో దసరాపాటలు పాడుతూ తిరిగేవారు.

ఇప్పుడు కాలం మారింది. కూటమి ప్రభుత్వం వచ్చింది. బడా నేతల అండదండలతో అధికార పార్టీకి చెంది చోటా మోటా నేతలు దసరా వస్తున్న సమయంలో పాటలు కాదు.. దందాటలు చేస్తున్నారు.

'ఏదయా.. మాకు దసరా మామూళ్లు ఏదయా.. వచ్చిన వెంటనే ఇచ్చుట మీకు మర్యాద.. లేదంటే ఉంటాయి తదుపరి చర్యలయా..!'' అంటూ పేట్రేగిపోతున్నారు. కనిపించిన దుకాణం, వ్యాపారి దగ్గరికి వెళ్లి దసరా మామూళ్లపేరుతో దందా చేస్తున్నారు. నగరంలోని పలు నియోజకవర్గాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే అనుచరులమని చెబితే.. కొందరు ఇవ్వరేమోనని.. పలు ప్రభుత్వ విభాగాల సిబ్బంది సహకారం తీసుకుంటున్నారు.

ఆ మూడు నియోజకవర్గాల్లో..

టీడీపీ, జనసేన, బీజేపీ.. అని తేడా లేకుండా.. ఎమ్మెల్యేల అనుచరులమంటూ మార్కెట్‌లో కొందరు చోటా మోటా నేతలు పండగ పేరుతో హల్ చల్ చేస్తున్నారు. ముఖ్యంగా తమ నియోజకవర్గాల పరిధిలోని ప్రధాన వాణిజ్య సముదాయాలు, వ్యాపారులు, మార్కెట్‌లు, రియల్ ఎస్టేట్ సంస్థలని టార్గెట్ చేశారు. ఎమ్మెల్యే అనుచరులమని, దసరా మామూళ్లు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు.



వ్యాపారం జరిగే ప్రాంతాన్ని బట్టి.. రూ.1000 నుంచి మొదలు పెట్టి రూ.10 వేలు, రూ.20 వేలు కూడా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమకు నచ్చినట్లు ఇస్తామంటూ కుదరదంటూ.. ముందుగానే వ్యాపారి, లేదా వ్యాపార సంస్థ పేరు రాసి.. దానిపక్కన.. తాము అనుకున్న అమౌంట్ వేసి.. అంతే ఇవ్వాలని ఆదేశిస్తున్నారంట. విశాఖ దక్షిణం, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎక్కువగా ఈ తరహా వసూళ్లు జరుగుతున్నాయని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తరంలోనూ ఒకరిద్దరు కషాయం నేతలు కూడా దేవుడి పేరుతో దందాకు దిగినట్లు తెలుస్తోంది.

ఆయా విభాగాల సిబ్బందితో కలిసి..

కొందరు వ్యాపారులు తమ మాటని లెక్క చెయ్యరని తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యేల అనుచరులు.. వివిధ ప్రభుత్వ విభాగాల సిబ్బందితో కలిసి ఈ అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. ముఖ్యంగా ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ, వాణిజ్య పన్నుల శాఖకు చెందిన ఆయా నియోజకవర్గాల్లో విధులు నిర్వర్తిస్తున్న దిగువస్థాయి సిబ్బంది కొందర్ని వీరి వెంట తీసుకెళ్తున్నారని తెలుస్తోంది. జీవీఎంసీ వాటర్‌సప్లై, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది, ఈపీడీసీఎల్ లైన్‌ఇన్‌స్పెక్టర్లు, కొన్ని చోట్ల ఏఈఈలు ఇలా వీరిని పక్కన పెట్టుకొని చోటా నేతలు దసరా దందాలు చేస్తున్నట్లు సమాచారం. పైగా ఎమ్మెల్యేపేరు చెప్పి చేస్తుండటంతో ఎవ్వరూ ఏమీ అనకుండా చోటా నేతలు ఎంత చెబితే అంత చేతిలో పెట్టి పంపించేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారం ఎమ్మెల్యేలకు తెలీకుండా జరగదని ఎంతోకొంత ప్రమేయం ఉంటుందని వ్యాపారులు వాపోతున్నారు. మొత్తానికి కూటమి నేతలు కబ్జాల పర్వమే కాకుండా దసరా మామూళ్ల పర్వానికి కూడా దిగజారిపోవడం కొసమెరుపు.

ఎడమ కాలితో పరీక్ష రాసి ఉద్యోగం

సింహాచలం నాయుడిని అభినందించిన కలెక్టర్



జామి సింహాచలంను అభినందిస్తున్న కలెక్టర్

మహారాణిపేట: పుట్టుకతోనే రెండు చేతుల అంగవైకల్యం ఉన్నా, ఎడమ కాలుతో పరీక్ష రాసి మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం (ఎస్జీటీ) సాధించిన జామి సింహాచలం నాయుడును కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అభినందించారు. కష్టపడి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విజయనగరం జిల్లా గనిశెట్టిపాలేనికి చెందిన నాయుడు.. రాష్ట్ర స్థాయిలో 320 వ ర్యాంకు సాధించగా, దివ్యాంగుల కేటగిరీలో 4వ ర్యాంకు వచ్చింది. అయితే ఆయన ఓపెన్ కేటగిరీలోనే ఉద్యోగం సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జేసీ కె. మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాటు కోళ్లకు ఫుల్ గిరాకీ

- దసరా ఎఫెక్ట్
- కిలో ధర రూ.900
- మటన్‌కు పోటీగా పెరుగుదల
- సందడిగా నాటుకోళ్ల సంత

ఆరిలోవ: దసరా పండుగ సందర్భంగా నాటుకోళ్లకు విపరీతంగా గిరాకీ పెరిగింది. సాధారణంగా దసరా సమయంలో కేవలం రూ.10 నుంచి రూ.25 మాత్రమే పెరిగే ధర ఈసారి ఏకంగా రూ.100 నుంచి రూ.200 వరకు పెరిగింది. మటన్‌కు దీటుగా ధరలు పెరిగినప్పటికీ, దసరా మొక్కుల కోసం వినియోగదారులు నాటుకోళ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. పాత డెయిరీఫారం వద్ద ఉన్న నాటుకోళ్ల సంతలో ప్రస్తుతం కిలో నాటుకోడి ధర రూ.900కు చేరింది. మంగళ, బుధవారాల్లో ఇది రూ.1,000కు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం దీని ధర రూ.800 మాత్రమే ఉండేది. డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ధరలను పెంచేశారు.

40 ఏళ్ల నాటుకోళ్ల సంత

పాత డెయిరీఫారం వద్ద సుమారు 40 సంవత్సరాల నుంచి నాటుకోళ్ల సంత జరుగుతోంది. ప్రారంభంలో కోడి రూ.20, రూ.30కే విక్రయించేవారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముతుంటారు. నగరంలో పారిశ్రామిక వాడలు ఎక్కువగా ఉండటం వల్ల దసరా సందడి ఇక్కడ ఎక్కువగా కనిపిస్తుంది. పరిశ్రమలు, వాహనాలు, యంత్రాలకు నాటుకోళ్లతో మొక్కులు తీర్చుకోవడం ఇక్కడ ఆనవాయితీ. గాజువాక, ఆటోనగర్, గోపాలపట్నం, అక్కయ్యపాలెం వంటి ప్రాంతాల నుంచి ఎక్కువగా జనాలు ఇక్కడికి వస్తారు.

గిరిరాజు కోళ్లతో జాగ్రత్త

నాటుకోళ్ల మాదిరిగానే కనిపించే 'గిరిరాజు' కోళ్లను కొందరు వ్యాపారులు అధిక ధరకు అమ్ముతూ వినియోగదారులను మోసం చేస్తున్నారని వ్యాపారులు హెచ్చరిస్తున్నారు. గిరిరాజు కోళ్ల ధర కిలో రూ.400 మాత్రమే ఉంటుందని, కానీ నాటుకోడి ధరతో వాటిని విక్రయిస్తున్నారని వారు చెప్పారు. గిరిరాజు కోళ్లు పొట్టి కాళ్లతో, దట్టమైన వెంట్రుకలతో ఉంటాయని, వాటి బరువు ఒకటిన్నర కిలోలకు మించి ఉండదని తెలిపారు. నాటుకోడి కావాలనుకునేవారు ఈ తేడాలను గమనించి, తెలిసినవారిని తీసుకెళ్లి కొనుగోలు చేయాలని వారు సూచించారు.



డెయిరీఫారం వద్ద విక్రయాలకు సిద్ధంగా ఉన్న నాటుకోళ్లు

ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో నంబర్-1గా ఏపీ

విశాఖ సిటీ: ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్-1 స్థానాన్ని నిలబెట్టుకుంటూ వస్తోందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' రీజినల్ అవుట్‌రీచ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు, పాలసీలను రూపొందించిందని తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల అనుమతులు త్వరితగతిన మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలో రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా 8 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ఐటీ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయని, భవిష్యత్తులో విశాఖలో వైట్ కాలర్ ఉద్యోగాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, స్టీల్ ప్లాంట్‌తో పాటు మరెన్నో యూనిట్ల పనులు జరుగుతున్నాయని వివరించారు. పరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగేశ్వరరాజు మాట్లాడుతూ సింగిల్ డెస్క్ ప్రోగ్రాం ద్వారా 23 విభాగాలకు చెందిన 123 అనుమతులు, లైసెన్సులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సులభతరమైన వ్యాపారాల కోసం 2024-25లో 435 సంస్కరణలు చేసినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది కూడా రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలబడాలంటే, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు సర్వే కాల్స్/మెసేజ్‌లకు సరైన సమాధానాలు ఇవ్వాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో విశాఖ డీఐసీ జీఎం ఆదిశేషు, పారిశ్రామికవేత్తలు సాంబశివరావు, పాండురంగ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

రిజిస్ట్రార్ బంగ్లాకు మరమ్మతులు నిజమే

ఖర్చెంతో అడగొద్దు

విశాఖ సిటీ: ఏయూ రిజిస్ట్రార్ భవనానికి మరమ్మతులు చేసి ఉపకులపతి నివాసంగా వినియోగించడం వాస్తవమేనని ఏయూ అధికారులు అంగీకరించారు. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు చేయలేదని చెబుతూనే ఆ మరమ్మతులకు అయ్యే ఖర్చు వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం. ఏయూ వీసీ బంగ్లా గత ఆరేడు ఏళ్లుగా వినియోగించకపోవడంతో నిర్వహణ లేక నివాసయోగ్యానికి అనుకూలంగా లేక వదిలేసినట్లు తెలిపారు. అలాగే రిజిస్ట్రార్ భవనాన్ని కూడా చాలా కాలంగా వినియోగించకుండా వదిలేయడంతో అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి వీసీ నివాసంగా మార్చినట్లు ప్రకటించారు. అయితే ఇందుకు అయ్యే ఖర్చును మాత్రం ఏయూ అధికారులు బహిర్గతం చేయకపోవడం విశేషం. ఈ ఖర్చుకు సంబంధించిన వివరాలను విశ్వవిద్యాలయ ఇంజినీర్స్ విభాగంలో గల డీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుమతితో చూడవచ్చని వివరణ ఇవ్వడం గమనార్హం.

కైలాసగిరి కిటకిట

ఆరిలోవ: కైలాసగిరి పర్యాటక కేంద్రం సోమవారం సందర్శకులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది పర్యాటకులు తరలిరావడంతో కొండపై పండగ వాతావరణం నెలకొంది. పర్యాటకుల తాకిడికి కొండపైకి వెళ్లే వాహనాలు బారులు తీరాయి. కొండపై ఉన్న పార్కింగ్ స్థలం పూర్తిగా నిండిపోవడంతో, ఘాట్ రోడ్డుపై మొదటి మలుపు వరకు ఇరువైపులా కార్లు, టూరిస్ట్ బస్సులతో సహా ఇతర వాహనాలను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొండపై ఉన్న పచ్చిక బయళ్లు, ఆట స్థలాలు సందర్శకులతో నిండిపోయాయి. పిల్లలు ఆట వస్తువులతో ఆడుకుంటూ ఉత్సాహంగా గడిపారు. శివపార్వతుల విగ్రహాలు, సీ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. సాధారణంగా ఆదివారాలు రద్దీగా ఉండే కైలాసగిరి.. సోమవారం కూడా జనసంద్రంగా మారడానికి పాఠశాలలకు, కళాశాలలకు దసరా సెలవులు ప్రకటించడం ఒక కారణమైతే, సోమవారం జంతు ప్రదర్శనశాలకు సెలవు దినం కావడం మరో కారణం. దీంతో జూకు వెళ్లాలనుకున్న పర్యాటకులు సైతం కైలాసగిరికి తరలిరావడంతో రద్దీ ఊహించిన దానికంటే ఎక్కువైంది. ఈ రద్దీ కారణంగా టాయ్ ట్రైన్ నిరంతరం పర్యాటకులతో తిరిగింది. సందర్శకుల తాకిడితో వీఎంఆర్డీఏకు గణనీయమైన ఆదాయం లభించింది.



కైలాసగిరి శివపార్వతుల విగ్రహాల వద్ద సందర్శకులు



సీ వ్యూ పాయింట్ వద్ద సందర్శకులు



కైలాసగిరిపై ఆటలాడుతున్న పిల్లలు

గజ్జె కట్టిన డాక్టరమ్మ



నృత్య ప్రదర్శన ఇస్తున్న డాక్టర్‌జాహ్నవి ప్రసాద్

ఏయూక్యాంపస్: రోగులకు వైద్యం అందించే ఓ వైద్యురాలు నృత్య కళాకారిణిగా మారి అందరి ప్రశంసలు అందుకున్నారు. డాక్టర్ జాహ్నవి ప్రసాద్ బొడ్డేపల్లి, తాను చిన్నతనం నుంచి నేర్చుకున్న కూచిపూడి నృత్యాన్ని బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సోమవారం సాయంత్రం ఆలయ కళావేదికపై ఆమె నిర్వహించిన కూచిపూడి నృత్య అరంగేట్రం ఎంతో ఘనంగా జరిగింది. గురువు లలిత గుప్తా వద్ద నృత్యాన్ని అభ్యసించిన జాహ్నవి, తన కళా ప్రతిభను ప్రదర్శించి అందరినీ అబ్బురపరిచారు. ఎంతో ఒత్తిడితో కూడుకున్న వైద్య వృత్తిలో ఉంటూనే, నృత్యంపై తనకున్న ఆసక్తితో సాధన చేసి ఈ స్థాయికి చేరుకోవడం అందరికీ స్ఫూర్తినిస్తుంది.

నేడు వైఎస్సార్ సీపీ నిరసన

డాబాగార్డెన్స్: విజయవాడలోని బి.ఆర్. అంబేడ్కర్ స్మృతివనం స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నిరసనకు పిలుపునిచ్చింది. మంగళవారం ఎల్ఐసీ బిల్డింగ్ జంక్షన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకట రమణ, రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజాబాబు తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపు మేరకు ఈ నిరసన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విశాఖ- అరకు కార్వాన్ రెడీ

వసతులను పరిశీలించిన కలెక్టర్



సకల హంగులతో కార్వాన్



కార్వాన్ వాహనంలో వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశాఖ నుంచి అరకు వరకు ప్రత్యేక ప్యాకేజీ రూపంలో నడపనున్న కార్వాన్ వాహనాన్ని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సోమవారం కలెక్టరేట్ వద్ద సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ ఆర్.డి. కల్యాణి, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె. మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్ కలిసి కలెక్టర్‌కు కార్వాన్ వాహనం ప్రత్యేకతలను వివరించారు. ఈ ప్రత్యేక వాహనాన్ని త్వరలోనే లాంఛనంగా ప్రారంభించి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

రేపు సీఎం ట్రాన్సిట్ హాల్ట్

మహారాణిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం విశాఖలో ట్రాన్సిట్ హాల్ట్ చేయనున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం వెళ్తారు. అక్కడ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం, ఆయన హెలికాప్టర్‌లో నేరుగా విజయవాడకు బయలుదేరే అవకాశం ఉంది.

వాల్తేరులో అభివృద్ధి పనులు వేగవంతం

సాక్షి, విశాఖపట్నం: వాల్తేరు పరిధిలో నిరంతరం సమీక్షలు నిర్వహించి పనులు వేగవంతం చేస్తూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బోరా స్పష్టం చేశారు. ఈ మేరకు డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలపై సోమవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వాల్తేరు డివిజన్ ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో ఉందని, త్వరలోనే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు మారనుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరు జనరల్ మేనేజర్లు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ.. అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇది వాల్తేరు డివిజన్ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతోందని వివరించారు. సరకు రవాణాలో అగ్రభాగంలో పయనిస్తున్నామని తెలిపారు. డివిజన్‌లోని ప్రతి ఒక్క అధికారి.. ఇబ్బందితో కాకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్నారని డీఆర్ఎం.లలిత్ బోరా తెలిపారు.

మళ్లీ ప్రసవించిన సింహం!

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో సింహానికి రెండు కూనలు జన్మించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మూడు రోజుల కిందట జన్మించిన ఈ పిల్లల వివరాలను జూ అధికారులు గోప్యంగా ఉంచారు. ఈ ఏడాదిలో తల్లి సింహానికి కూనలు జన్మించడం ఇది రెండోసారి. సుమారు తొమ్మిది నెలల కిందట ఇదే తల్లి సింహం రెండు కూనలకు జన్మనిచ్చింది. అయితే ఆ కూనల్లో ఒకటి తల్లి సింహం కాళ్లతో తొక్కడం వల్ల, మరొకటి అనారోగ్యంతో మృతి చెందాయి. ఈ విషాదకర ఘటనల నేపథ్యంలో తాజాగా జన్మించిన రెండు సింహం పిల్లలను కాపాడుకునేందుకు జూ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, సింహం పిల్లలను సంరక్షించడానికి జూ వైద్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు.

మెరుగు పేరుతో ఘరానా మోసం

- 24 తులాల బంగారు ఆభరణాల చోరీ
- మట్టి కుండలో ఉప్పు పెట్టి ఉడాయించిన కేటుగాళ్లు
- ప్రధాన నిందితుడి అరెస్ట్, మొత్తం సొత్తు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు


నిందితుడు రమణ

కూర్మన్నపాలెం: పాత బంగారు, వెండి ఆభరణాలకు మెరుగు పెడతామని నమ్మించి.. మహిళను మోసం చేసిన అంతర్ జిల్లా ఘరానా మోసగాడు ముదేరినవారి రమణను దువ్వాడ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచీ 24 తులాల బంగారు ఆభరణాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు.

దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి ప్రశాంతినగర్‌లో స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ నివాసం ఉంటున్నారు. అతని భార్య వద్దకు ఈ ఏడాది జూలై 15న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారు. పాత బంగారు ఆభరణాలకు కొత్త మెరుపు తీసుకువస్తామని, తమ వద్ద ఉన్న నమూనాలను చూపి నమ్మించారు. వారి మాటలు విశ్వసించిన ఆమె.. తన వద్ద ఉన్న సుమారు 24 తులాల బంగారు ఆభరణాలను వారికి ఇచ్చింది. నిందితులు ఆ ఆభరణాలను ఒక మట్టి కుండలో పెట్టి, ఏదో రసాయన ద్రావణంలో ముంచినట్లు నాటకమాడారు. అనంతరం ఆ కుండకు ఒక తెల్లని వస్త్రం చుట్టి.. 'ఈ కుండను 10 రోజుల పాటు ఇంటి ఈశాన్య దిశలో సూర్యరశ్మి తగలకుండా ఉంచి, 11వ రోజున తెరవాలి' అని చెప్పి అక్కడి నుంచి ఉడాయించారు. వారి సూచన మేరకు 11వ రోజున కుండను తెరిచి చూడగా, అందులో బంగారు ఆభరణాలకు బదులుగా కల్లు ఉప్పు ఉండటంతో బాధితురాలు తాను మోసపోయానని గ్రహించింది. కుటుంబ సభ్యుల సాయంతో ఆగస్టు 20వ తేదీన దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటై, దర్యాప్తు ప్రారంభించాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుల కదలికలను పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో ఈ నెల 29న అనకాపల్లి జిల్లా మారేడుపూడి బస్టాప్ వద్ద ప్రధాన నిందితుడైన ముదేరినవారి రమణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రమణది అన్నమయ్య జిల్లా పాతరాయచోటి. గతంలో కూడా అతను పలు ప్రాంతాల్లో ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఏ2గా ఉన్న మారేడుపూడి గ్రామానికి చెందిన చప్పిడి నూకరాజు పాత్రపై విచారణ కొనసాగుతోందని సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బంగారు హారం-1, బంగారు నెక్లెస్‌లు-2, పెద్ద బంగారు గొలుసు-1, చిన్న బంగారు గొలుసులు-3, బంగారు లాకెట్లు-2, చెవి దిద్దులు-3 జతలు, బంగారు ఉంగరాలు-10, బ్రాస్‌లెట్-01, పాపిడి బిళ్ల-1, రూ.5300 స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

తల్లికి వందనం.. కలెక్టరేట్‌కు క్యూ

న్యాయం చేయాలని పీజీఆర్ఎస్‌లో వినతులు


కలెక్టరేట్ ఆవరణలోనే ల్యాప్‌టాప్‌లో వివరాలు చూస్తున్న డీఈవో కార్యాలయ సిబ్బంది

మహారాణిపేట: 'తల్లికి వందనం'పథకం లబ్ధి కోసం తల్లులు అష్టకష్టాలు పడుతున్నారు. తమకు అర్హత ఉన్నప్పటికీ నగదు ఖాతాల్లో జమ కాలేదంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఫిర్యాదులు చేశారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా తమ సమస్య పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, వాటిని వెంటనే పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ కుమార్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి ఉషారాణిలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత అధికారులు, సిబ్బంది వెంటనే కలెక్టరేట్‌లోనే ల్యాప్‌టాప్‌లతో లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు.

కొర్రీలతో లబ్ధిదారుల కోత

ప్రభుత్వం విధించిన నిబంధనల కారణంగా చాలా మందికి ఈ పథకం అందకుండా పోయింది. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం కింద 25శాతం కోటాలో ఉచిత సీటు పొందిన విద్యార్థుల తల్లులకు ఈ పథకాన్ని నిలిపివేశారు. ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉండి, ఒకరికి ఉచిత సీటు వస్తే, రెండో బిడ్డకు తల్లికి వందనం వర్తింపజేయలేదు. అంతేకాకుండా, నెలవారీ విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటినా లేదా ఇతర ప్రభుత్వ పథకాలు పొందుతున్నా అనర్హులుగా ప్రకటించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచిత సీట్లు పొందిన విద్యార్థులకు కూడా అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశారని, కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీకి విరుద్ధంగా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకే ఇలాంటి కఠిన నిబంధనలు తీసుకొచ్చిందని పలువురు తల్లులు ఆరోపించారు. తమకు ఉచిత సీటు రాకపోయినా, ఆన్‌లైన్‌లో వచ్చినట్లుగా తప్పుగా చూపిస్తూ పథకాన్ని నిలిపివేస్తున్నారని మరికొందరు వాపోయారు.

ఇది మూడోసారి..



నాకు ఇద్దరు పిల్లలు. ప్రభుత్వ పాఠశాల్లోనే చదువుతున్నారు. అయినా తల్లికి వందనం రాలేదు. సచివాలయం చుట్టూ తిరిగినా ఎవరూ సరైన కారణం చెప్పడం లేదు. కలెక్టరేట్‌కు రావడం ఇది మూడోసారి. ఇప్పుడు నా భర్త జి.రమణ పేరు మీద రెండు కరెంట్ మీటర్లు ఉన్నాయని చెబుతున్నారు. మాకు ఉన్నది చిన్న ఇల్లు మాత్రమే. ఆ రెండో మీటర్ ఎక్కడిదో విచారణ చేయాలి. దయచేసి నా పిల్లలకు న్యాయం చేయండి.

– గరికిన సింహాచలం, దిబ్బపాలెం, పెదగంట్యాడ

ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం

కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజల నుంచి అందిన వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్‌లతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో సంబంధిత అధికారి లేదా సిబ్బంది తప్పనిసరిగా ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, తగిన విధంగా ఎండార్స్‌మెంట్ వేసి ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై మొత్తం 365 వినతులు అందజేశారు. ఇందులో రెవెన్యూ విభాగానికి 121, జీవీఎంసీకి 124, పోలీస్ శాఖకు 26, ఇతర అంశాలకు చెందిన 94 వినతులు ఉన్నాయి.

ముస్లింల అభివృద్ధికి వినతి



రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ నూర్ భాషా/దూదేకుల అభ్యున్నతికి చర్యలు చేపట్టాలి. మైనార్టీ నూర్ భాషా జీవన ప్రమాణాలు మెరుగు పడే విధంగా పేదలకు ఆర్థిక భరోసా కల్పించాలి. వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథులు, అవివాహిత మహిళలకు రుణాలు మంజూరు చేయాలి. చికెన్, మేక మాంసం వ్యాపారం చేసే నూర్ భాషా/దూదేకుల సామాజిక వర్గాలకు ఫ్లోర్ వీలర్ మోపెడ్ వాహనాలు ఇవ్వాలి. చేనేత కార్మికులకు, పరుపులు కుట్టే దర్జీలకు, ఇతర చేతి వృత్తుల వారికి పనిముట్లు ఇవ్వాలి.

–షేక్ బాబ్జీ, సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ, ఉత్తర నియోజకవర్గం

జీవీఎంసీకి 112 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్లు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 112 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 59 ఫిర్యాదులు ఉన్నాయి. అలాగే జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 5, ఇంజనీరింగ్ సెక్షన్‌కు 18, మొక్కల విభాగానికి 7, యూసీడీ విభాగానికి 9 ఫిర్యాదులు వచ్చినట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ తెలిపారు. ఫిర్యాదులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పోలీస్ శాఖకు 80 ఫిర్యాదులు


ఫిర్యాదులు వింటున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 80 ఫిర్యాదులు వచ్చాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీ స్వయంగా పాల్గొనగా, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో సీపీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

జీఎస్టీ 2.0పై అవగాహన

మహారాణిపేట: జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా ప్రజలకు చేకూరుతున్న లబ్ధి, పొదుపు వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీఎస్‌డబ్ల్యూఎస్ రివ్యూ మీటింగ్‌లో కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల సిబ్బందిని చాంపియన్లుగా గుర్తించామని, వారు ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. ధరలు ఎలా మారాయో విడమరిచి చెప్పాలని సూచించారు. అక్టోబర్ 1న పింఛన్ల పంపిణీ సమయంలోనూ జీఎస్టీపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. వీటితో పాటు కలెక్టర్ పీ-4 మ్యాపింగ్, పీఎం సూర్యఘర్, ఆధార్ సీడింగ్, ఇ-కేవైసీ, వివిధ సంక్షేమ పథకాల దరఖాస్తుల పెండింగ్, సచివాలయాల సిబ్బంది హాజరుపై వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సచివాలయాల్లో సేవలను విస్తృతం చేయాలని, సిబ్బంది సమయపాలన పాటించని వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగునీటి శుద్ధిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

స్త్రీ శక్తి పథకం అమలులో విశాఖ జిల్లా ఫస్ట్

మద్దిలపాలెం: స్త్రీ శక్తి పథకం అమలులో జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు వెల్లడించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించి, విశాఖ జిల్లాను ప్రశంసించారని పేర్కొన్నారు. మద్దిలపాలెం డిపోలో సోమవారం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకాన్ని 74శాతం అమలు చేసి, విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది అంకితభావమే ఈ పథకం విజయానికి దోహదపడిందన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు


వేడుకలు ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ అధికారులు

ఉక్కునగరం: బతుకమ్మ సంబరాలు ఉక్కునగరంలో సోమవారం ఘనంగా ముగిశాయి. స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కునగరం సీ భవనంలో ఈ వేడుకలు జరిగాయి. తెలంగాణ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. అంతకుముందు స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం ఎస్.భాను, హెచ్ఆర్ డీజీఎం డి.రాధిక ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ముఖ్య సలహాదారు ఎస్.వీరేశం, అధ్యక్షుడు ఎస్.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, బి.వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, రవిశేఖర్, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

చైతన్య మహిళా కళాశాలలో మరో రెండు కొత్త కోర్సులు

గాజువాక: స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కొత్తగా రెండు పీజీ కోర్సులను ప్రవేశపెట్టినట్టు ఆ కళాశాల కరస్పాండెంట్ జి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎమ్మెస్సీ అనలైటికల్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ మైక్రోబయాలజీలను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం తమ కళాశాలలో ఉన్న ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ మ్యాథ్‌మేటిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్‌తోపాటు హాస్టల్ సౌకర్యం, మెరిట్ స్కాలర్‌షిప్ యథాతథంగా అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాల కోసం 9866433388, 9160314464 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు యథావిధిగా విద్యుత్ కలెక్షన్ కౌంటర్లు

మహారాణిపేట: ఆపరేషన్ సర్కిల్ పరిధిలో ఉన్న అన్ని విద్యుత్ కలెక్షన్ కౌంటర్లు మంగళవారం యథావిధిగా పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. శ్యామ్ బాబు తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, రాజీవ్ ఈపీడీసీఎల్ కౌంటర్లు బిల్లుల చెల్లింపుల కోసం తెరిచే ఉంటాయన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'జూనియర్ అథ్లెటిక్స్' చాంపియన్ విశాఖ


బహుమతి అందుకుంటున్న విశాఖ అథ్లెట్లు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విశాఖ అథ్లెట్లు బి.ఇషానా, కె.ఆర్.వి.ఎం. కుమార్, బి.శైలజ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి వ్యక్తిగత చాంప్‌లుగా నిలిచారు. ఈ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకుంది. సోమవారంతో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ముగిసిన ఈ పోటీలను సబ్‌జూనియర్ (అండర్-14, 16), యూత్ (అండర్-18), జూనియర్ (అండర్-20) బాలబాలికల విభాగాల్లో ట్రాక్ అండ్ ఫీల్డ్ అంశాల్లో నిర్వహించారు. బాలికల అండర్-14 విభాగంలో ఇషానా, అండర్-18 విభాగంలో శైలజ, బాలుర అండర్-16 విభాగంలో కుమార్ తమ విభాగాల్లో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లు సాధించారు. అలాగే విశాఖ జిల్లా జట్టు 269 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. బాలుర చాంపియన్‌షిప్‌ను 156 పాయింట్లతో విశాఖ కైవసం చేసుకోగా, బాలికల చాంపియన్‌షిప్‌ను 113 పాయింట్లతో సాధించింది.

రూ.999కే గుండె పరీక్షల ప్యాకేజీ


ప్యాకేజీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు

ఆరిలోవ: ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని హెల్త్‌సిటీలోని కేర్ ఆస్పత్రి హార్ట్ స్మార్ట్ ప్యాకేజీని ప్రారంభించింది. ఆస్పత్రిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైద్యులు ఈ ప్యాకేజీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.వి.రావు మాట్లాడుతూ.. గుండె జబ్బులు యువతలో కూడా పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. చాలా మంది యువతలో ఉన్న ప్రమాదకరమైన నిశ్శబ్ద కారకాలు గురించి అవగాహన లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించకపోవడం వంటి జీవనశైలి కారకాలు యువతలో గుండె వ్యాధులకు దారి తీస్తున్నాయని తెలిపారు. నిశ్శబ్ద కారకాలను ముందుగానే గుర్తించి నివారించడానికి ప్రతి ఒక్కరూ తరుచూ గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సి.వి.రావు సూచించారు. కేర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూఖ్ చైదురి మాట్లాడుతూ హార్ట్‌స్మార్ట్ ప్యాకేజీలో ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, 2డీ ఎకో, ట్రెడ్‌మిల్ టెస్ట్ తదితర పరీక్షలు కేవలం రూ.999కే చేస్తామని తెలిపారు.

పోలమాంబ ఆలయ ట్రస్ట్ సభ్యుల నియామకం

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ దేవాలయం ట్రస్ట్ సభ్యులను ప్రభుత్వం సోమవారం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్-అఫీషియో సెక్రటరీ హరి జవహర్ లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ కమిటీలో 11 మంది సభ్యులు, ఓ ఎక్స్-అఫీషియో సభ్యుడు ఉంటారని ఉత్తర్వులలో పేర్కొన్నారు. నియమితులైన ఈ సభ్యుల పదవీ కాలం రెండేళ్ల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

మసీదు పక్కన మద్యం దుకాణమా?

రద్దు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు


మద్యం షాపు రద్దు చేయాలని కోరుతున్న ముస్లిం కమిటీ వెల్‌ఫేర్ సొసైటీ ప్రతినిధులు

మహారాణిపేట: రామా టాకీస్ సమీపంలోని యాసీన్ మసీదు పక్కన మద్యం దుకాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని యాసీన్ మసీదు ముస్లిం కమిటీ వెల్ఫేర్ సొసైటీ నాయకులు కోరారు. సొసైటీ నాయకులు మహ్మద్ అహ్మదుల్లా ఖాన్, సయ్యద్ మహ్మద్ పీజీఆర్ఎస్‌లో సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. 70 ఏళ్ల కిందట నిర్మించిన యాసీన్ మసీదుకు ఎంతో చరిత్ర ఉందని, ఈ మసీదు దగ్గరలో మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వడం తగదని సొసైటీకి చెందిన డాక్టర్ అబ్దుల్ రహ్మాన్, దేవరకొండ మార్కండేయులు అన్నారు. ప్రార్థనా స్థలం, బుల్లయ్య కాలేజీ పక్కన మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం వల్ల ఆ ప్రాంతంలో శాంతిభద్రతల సమస్యలు వచ్చే అవకాశం ఉందని, మద్యం దుకాణం ఏర్పాటుకు ఇచ్చిన అనుమతిని తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు.

కోర్టు కేసుల్లో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కోర్టు కేసుల విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, నిర్ణీత సమయంలో కౌంటర్లు దాఖలు చేయాలని కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు కాలయాపన చేయకుండా ఎప్పటి ఫైళ్లను అప్పుడే పరిష్కరించాలని స్పష్టం చేశారు. పీ-4 పథకంలో భాగంగా జిల్లాలో గుర్తించిన 64 వేల బంగారు కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆదేశించారు. తొలి దశలో వారిలో పది శాతం మందికైనా ప్రాథమిక అవసరాలను గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఆర్థికపరమైన అంశాలతోపాటు, సామాజిక అంశాల్లో వారికి ప్రత్యేక సాయం అందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ఈ బంగారు కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకోవాలని, ఆయా శాఖల పరిధిలో చేసిన సాయం, ఇతర అంశాలకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు సీపీవోకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని సాధించడానికి అధికారులంతా సమష్టి కృషి చేయాలని కలెక్టర్ నిర్దేశించారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోని అంశాలను ఆధారంగా చేసుకొని.. జిల్లా అభివృద్ధికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టబోయే ప్రగతిశీల పనులకు సంబంధించి మూడు నెలలు, ఏడాదికి అనుగుణంగా భవిష్యత్తు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా అప్పన్న ఆయుధ పూజ


సింహగిరిపై సింహవల్లీ తాయారు సన్నిధిలో అప్పన్న ఆయుధాలను ఉంచి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విజయదశమి ఉత్సవాల్లో భాగంగా.. మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న సింహవల్లీ తాయారు సన్నిధిలో ఈ పూజలను పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆయుధాలైన గద, ధనస్సు, బాణం, కత్తి, పరశురామ గొడ్డలి, ఖైజార్ తదితరాలను పూజ కోసం ఉంచారు. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఆయుధ దేవత ఆవాహనం, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుధాలకు విశేషంగా హారతులిచ్చారు. అనంతరం పూజలో ఉంచిన ఆయుధాలను సింహవల్లీ తాయారుకి అలంకరించారు. ఆలయ స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈ పూజను నిర్వహించారు. విజయదశమి వరకు ఆయుధాలను సింహవల్లీ తాయారు సన్నిధిలోనే ఉంచి, ప్రతి రోజూ విశేషంగా ఆరాధన నిర్వహిస్తారు. అలాగే స్వామి సన్నిధిలో శ్రీరామ నవరాత్ర పారాయణం పఠించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నిబంధనలు పాటించాలి


బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

గోపాలపట్నం: దసరా పండుగ నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సుల యజమానులు అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ ఇన్‌చార్జ్ ఉప రవాణా కమిషనర్ ఆర్‌సీహెచ్. శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం నగరంలో పలుచోట్ల రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. బస్సులకు నిర్దేశించిన పర్మిట్, పన్ను తప్పనిసరిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులకు అసౌకర్యం కలిగించకుండా వాహన యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో వాహన తనిఖీ ఇన్‌స్పెక్టర్ల బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. 3 రోజుల్లో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన వాహనాలపై 28 కేసులు నమోదు చేసి, వాటి ద్వారా రూ.4.82 లక్షల జరిమానాలు వసూలు చేసినట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.